కథానిక :

# శుభలేఖ

"శ్రీ సత్యనారాయణ శ్రీవాత్సవ"

"నాకేమీ ఉత్తరాలు లేవోయి రామస్వామీ?" అని వేంకటరావు అడగడమే తడవుగా "మీ కేమీ లేవండీ" అని చెప్పి అప్పుడే అల్లంతదూరంలో అంతర్ధానమయ్యాడు పోస్టుమాన్ రామస్వామి. ఆఫీసు గుఱించి రావలసిన ఉత్తరంకోసం ఎదురుచూచి చూచి ఆశాభంగం పొందిన వెంకట్రావుకి మరొకరోజు గడచిపోయింది. ఉదయంటపా వచ్చిందంటే, మళ్లా పదకొండుగంటలకి రిజిస్టరీలు ఇవ్వడానికి మరొక పోస్టుమాన్ వస్తాడు. కాని తనకు రావలసిన కబురు రిజిస్టరులో ఎలాగ వస్తుంది? మరొక ఇరవైనాలుగు గంటలు పోవాలి తిరిగి రేపటిరోజు టపా రావడానికి. ఇక మధ్యలో ఆదివారాలు సెలవు ఇస్తే మరొకరోజు గడుపుకోవాలి. వేంకటరావు మనసు బాధగానే ఉన్నది. బదలీ కావాలని విశ్వప్రయత్నం చేశాడు లాభంలేకపోయింది. సెలవుపెట్టి ఇంట్లో కూర్చున్నాడు ఏవిధంగానైనా బదలీ కలిగే అవకాశం ఉంటే ఆ శుభవార్త ఉత్తరక్షణంలో తనకు తెలియచెయ్యాలని తన శ్రేయోభిలాషులని ఇందు నిమిత్తం ఏర్పాటు చేశాడు. ఇప్పటికి ఏ సంగతీ తెలియవలసిందే మరి. క్రిందటివారం తన పనిచేస్తున్న వాళ్లకు ఒకరిద్దరికి బదలీ అయినట్లు గాలివార్త వచ్చింది. తనమాటే ఎంతకీ తేలకుండా ఉన్నది ఈ అధికారులు అయినవాళ్లకి ఒకరకంగానూ, కాని వాళ్లకి కంచాలలోనూ పెట్టేరకం. ఇక్కడనించి కదలను మొఱ్ఱో అనేవాళ్లని వాళ్లకి నచ్చినచోట్లకి మారుస్తారు. తనబోటివాళ్లను, ఎన్ని దరఖాస్తులు పెట్టి ఎంత వేడుకొని బదలీ చెయ్యవలసిందని ఎంత బ్రతిమాలినా అలాగే ఉంచుతారు. మొత్తంమీద రావలసిన ఉత్తరం వేంకట్రావుకి రావడం లేదు. క్షణాలు యుగాలుగా గడుస్తున్నాయి

ఈ వారఫలితాల ప్రకారం బుధవారం తనకు శుభవార్త తెలియాలని ఉంది. అదీగాక జ్యోతిష్కుడు గోచారఫలాలు చూచి త్వరలో తనకు స్థానచలనం ఉందని చెప్పాడు. నిజమే మకర 'రవి' ౧౫వ తేదీనించి తనరాశిలో ప్రవేశిస్తూ ఉన్నాడు. చలనం తప్పదని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి, అయినా తన శుభవార్త రాలేదు,

వేంకట్రావు ఊరిలోకి బయలుదేరి తన మిత్రుడి మెడికల్ షాపులో కూర్చున్నాడు. మిత్రుడు రంగారావు వేంకట్రావు వాలకం కనిపెట్టి 'అయితే ఈ వేళకూడా ఉత్తరాలు రాలేదేమిటోయ్' అని పరామర్శ చేశాడు.

కొంతసేపు బాతాఖానీ అయినతర్వాత మరో 'బీటు' పోస్టుమాన్ సుఖాన్ సాహెబు వచ్చాడు. "బాబుగారు! మీ రిక్కడే ఉన్నారా? మీకు ఒక రిజిస్టరీ వచ్చిందండీ అని సంచీ తీస్తున్నాడు.

వేంకట్రావు "నాకు రిజిస్టర్ ఏమిటి ఆఫీసునించేమో" అని ఆత్రంగా చూస్తున్నాడు.

"త్వరగా తీయవోయ్! సాయెబూ! ఆయనకి చాల తొందరగా ఉంది. ట్రాన్సఫరు ఆర్డరు ఏమో చూడు" అని రంగారావు వేళాకోళం చేశాడు. "ట్రాన్సఫరు ఆర్డరు రిజిస్టరీగా రావడం ఎందుకు?" అని అడిగాడు. "ఇదేదో శుభలేఖండి బాబూ" అని పోస్టుమాన్ పైకి తీశాడు. "చిత్రంగా ఉందే- శుభలేఖకు రిజిస్టరీ యెందుకు?" అని వేంకట్రావు ఉత్తరం తీసుకున్నాడు.

"ఈ బుద్ధిమంతు డెవ్వరో అందుతుందో అందదో అని రిజిస్టరు కట్టాడు. అంత చిత్రపు పెళ్లికొడుకు ఎవరు?" అని రంగారావు అడిగాడు. "తిరుగురశీదుకూడా కట్టారండీ? ఇక్కడ సంతకం పెట్టండి" అని పోస్టుమాన్ సంతకం పెట్టించుకొని వెళ్లిపోయాడు.

"తిరుగురశీదుతో రిజిస్టరీ కట్టిన పెళ్లికొడుకు అసాధ్యుడై ఉండాలి. ఇలాగ అం



దరికీ శుభలేఖలు పంపితే అదొక మజా! అని రంగారావు వ్యాఖ్యానాలు చేస్తూ వట్టి వెయ్యివిధాలు అని తేల్చాడు.

"ఉత్తరం పంపినది పెళ్లికొడుకు కాదు, పెళ్లికూతురు" అని వెంకట్రావు ఆ అందమైన కవరుఅడ్రెసు అటూ యిటూ త్రిప్పుతున్నాడు. కవరులోపల పచ్చకాగితం మీద ముచ్చటయిన అచ్చుతో పెండ్లిపిలుపు అని వ్రాసిఉంది. అది త్రిప్పి చదువుతూ ఉంటే లోపలనించి ఒక్క నీలికాగితం మడత క్రింద పడింది, వెంకటరావు ఆనీలికాగితం విప్పి చదివాడు. రంగారావు ఇదంతా చూచి శుభలేఖ రిజస్టరీకట్టిన పెళ్లికూతురు ఎవరా అని ప్రశ్నార్థకం, ఆశ్చర్యార్థకం కలిపిన ముఖం పెట్టి చూస్తున్నాడు.

వేంకటరావు శుభలేఖా, ఉత్తరం చదవడం పూర్తిచేశాడు. చదువుతూఉన్నంతసేపు అతనిముఖంలో ఒక కొత్తవెలుగు కనిపిస్తోంది. కళ్లు నవ్వుతున్నాయి. పెదవులు ఒక చిరునవ్వులోకి విరుచుకొని రంగారావు ఇచ్చిన సిగరెట్టును అందుకొని ఒక చిన్న పొగదుమబ్బు వదలి బిగువు విప్పి మళ్లీ నవ్వుతో వికసించాయి.

రంగారావుకుతూహలం అతిశయిస్తోంది. చనువుతో ఆ శుభలేఖ చూచాడు ఫలానావారి జ్యేష్ఠపుత్రిక రాజ్యలక్ష్మీదేవి (యం బి. బి. యస్) ని ఫలానావారి అబ్బాయి సుబ్బావధానులు యం.ఏ. గారికిచ్చి నర్సాపురం గ్రామంలో ఫలానావారి స్వంతగృహంలో వివాహంచేస్తున్నారుకనక అందరూ వచ్చి తత్కృతచందనతాంబూలసత్కారాలు అందుకోవాలసిందని ఆ లేఖలో ఉన్నది. అది చూచి "ఎవరోయ్! ఈ బుద్ధిమంతురాలు" అని రంగారావు అడిగాడు.

వేంకట్రావు ముందు తెలియనట్లు ఎవరో, నాకు జ్ఞాపకం రావడంలేదు. అని తప్పుకోబోయాడు.

లోపల ఉత్తరం చదివినాగాని జ్ఞాపకం రాలేదూ? ఈ వేషానికేం అసలు సంగతి చెప్పవోయ్" అని రంగారావు ఇంకా అడుగుతున్నాడు.

"అయితే ఆ అమ్మాయి వ్రాసిన ఉత్తరం చదువుతాను విను." అని వేంకట్రావు మొదలుపెడ్తున్నాడు. 'అక్కర్లేదు, నీ రహస్యం ఎవ్వరూ అడగడంలేదు-అసలు వ్యవహారం ఏమిటో చెబితే చాలు. అంతే" అని రంగారావు ఏమీ ఎరగనట్టు ఊరుకున్నాడు.

"ఇందులో రహస్యం ఏమీ లేదు. చదువుతాను. విను.

శ్రీ వేంకట్రావుగారికి రాజ్యలక్ష్మి అనేకనమస్కారాలతో వ్రాయునది. నన్ను ఈ పాటికి మరచిపోయి ఉంటారని తలుస్తాను. మీరు విశాఖపట్టణం ఆసుపత్రినించి వెళ్లిపోయినతర్వాత నేను ఒకటిరెండుసారులు మాత్రం అక్కడికి వెళ్లాను. అక్కడ ఉన్న మెటర్నిటీ స్పెషలిష్టు మీరు ఎరగనివారు కారు. అతనినిగురించి ఎంతతక్కువ చెపితే అంతమంచిది. మీరు ఉన్నపుడు మీకోసం నేను వచ్చేదానను. ఆ రోజులు, బీచీలో మనం షికార్లు వెళ్లడం, అవన్నీ జ్ఞాపకం ఉంటాయని తలుస్తాను. నేను నర్సాపురంలో ప్రాక్టీసుపెట్టాను. బాగానే ఉంది. రేపు వైశాఖ బ॥ పంచమినాడు నా వివాహం. ఆయన బెంగుళూరులో ప్రొఫెసరుగా పనిచేస్తున్నారు.

మీకు శుభలేఖ పంపినాను. ఎప్పటివాత్సల్యంతో నన్ను జ్ఞాపకం ఉంచుకొంటారనుకొంటాను. మరి సెలవు, రాజ్యలక్ష్మి

"అయితే ఆమెకూడా డాక్టరే అన్నమాట." అని రంగారావు మళ్లా అంటున్నాడు.

"అవును డాక్టరే. అపుడు నాస్టూడెంటు" అని వేంకట్రావు అంటున్నాడు.

"అయితే—పెళ్లిచేసుకుంటానని భ్రమపెట్టి ఏమైనా ఆశపెట్టావేమో?" అని రంగారావు ఇంకా కథ పైకి తీస్తున్నాడు.

వేంకట్రావు సిగరెట్టు అంటించి మరొక పొగమబ్బు వదలి కథ చెప్తున్నాడు. రంగారావు శ్రద్ధతో వింటున్నాడు.

"రంగా! నీవు చెబితే నమ్మవు కాని ఈ అమ్మాయితో నాకంతపరిచయం లేనేలేదు. అందరితోనూ మాటలాడినట్టే ఈ రాజ్యలక్ష్మితోనూ మాటలాడేవాడిని అంతే. మరి విశేషం ఏమీ లేదు. కాని ఎంతో పరిచయం ఉన్నట్టు శుభలేఖ పంపించింది." అని వేంకట్రావు ఆలోచనలో పడ్డాడు.

"అసలు ఏమీ లేకుండా బీచిషికారు అదీ జ్ఞాపకం చేస్తుందా?" అని రంగారావు కొంటెప్రశ్న వేశాడు.

"అది కాదు. అసలు సంగతి చెబుతున్నానుగా! ఇందులో దాపరికం ఏమీ లేదు. నేను అమెరికానించి తిరిగివచ్చిన కొత్తరోజులు. విశాఖపట్టణంలో మెటర్నిటీస్పెషలిష్టుగా వేశారు. అపుడు అనేకమంది మెడికల్ స్టూడెంట్సులో రాజ్యలక్ష్మి ఒక్కర్తె. నేను ఎపుడు లెక్చరు తీసుకున్నా ఆ అమ్మాయి నా కేసే చూస్తూఉండేది."

"అయితే మరింకెవ్వళ్లూ లేడీస్టూడెంట్సు లేరా?" అని రంగారావు అడ్డుప్రశ్న

"లేకేం మరి" అయిదుగురు ఉండేవాళ్లు. ఇద్దరు క్రిష్టియన్లు ఎలిజబెతు, మేత్యూస్. వాళ్లతోనే ఎక్కువచనవుగా ఉండేవాడిని." అని వేంకట్రావు శ్రద్ధగా చెబుతున్నాడు.

"అవునులే కాకిబంగారం కాకిబంగారంతో అతుకుతుంది" అని రంగారావు అంటించాడు.

"ఛా! మనకి అలాంటివి అసలే పడవు. కొత్తలో లెక్చరు అంటే శ్రద్ధ వుండేది. ఒకరోజున లెక్చరు అయిపోయింది. అందరూ వెళ్లిపోయారు. రాజ్యలక్ష్మి మరినలుగురు మగడాక్టర్లూ కలిసి, వెయిటుంగురూములో కూర్చున్నాము. అందరూ కలిసి టీకి ఆర్డరిచ్చారు. నాకు టీ అసలే యిష్టంలేదు. వద్దన్నాను. రాజ్యలక్ష్మి నా సంగతి కనిపెట్టి—నాకోసం లేతకొబ్బరిబొండాలు ఆర్డరిచ్చింది రెండుబొండాలు వచ్చాయి. వాటిని ఐస్‌గ్లాసులో పోసి నౌకరు అందిచ్చాడు నేను ఏమీ మాట్లాడలేదు. మేమిద్దరమూ కొబ్బరినీళ్లు త్రాగినతర్వాత నౌకరు చేతికి రాజ్యలక్ష్మి వాటిఖరీదు ఇచ్చేసింది.

నువ్వెందుకు ఇవ్వడం? అని రాజ్యలక్ష్మిని కొంచెం కోపంగా చూచినట్టు చూచాను.

"ఏం? డాక్టరు? తప్పా? ఒక్కసారి కూలుడ్రింకు ఇవ్వడానికికూడా మీ స్టూడెంట్సుకు అవకాశం ఇయ్యరా?" అని రాజ్యలక్ష్మి ఏదో అనబోయింది.

నేను మాట్లాడలేదు. అపుడు మళ్లీ "అవును లెండి ఇతరడ్రింకులు అలవాటుపడిన వారికి నాటురకం కొబ్బరిడ్రింకులు ఏం నచ్చుతాయి?" అని వేళాకోళం చేసింది. నాకు కోపం వచ్చింది. కోపం సంగతి చెప్పానుకూడాను. పట్టిడ్రింకులు ఏం లాభం? ఒకరోజు మృష్టాన్నభోజనం పెట్టకూడదా!" అని అడిగాను.

"మీలాంటివారు మా యింటికి భోజనానికి ఎందుకు వస్తారు," అని ఎగతాళి చేసింది. "సీరియస్‌గా పిలుస్తే ఎందుకు రాను "బ్రాహ్మణో భోజనప్రియః" అని చెప్పాను.

"అలాగా?" అని అప్పటికి మాటలాడలేదు. నాశాఖసంగతి తెలియగానే ఎలిజబిల్ భర్తఅనితోచిందో ఏమిటో! ఒకసారి వాళ్ల

తండ్రిగారిని తీసుకొనివచ్చి పరిచయం చేసింది మర్నాడు వాళ్ళయింట్లో విందు. మనకంటె చాదస్తం వాళ్ళకి నిప్పు నీళ్ళతో కడిగి తీసుకుంటారు. నాచేత మడిబట్టలు కట్టించి మరీ భోజనం చేయించారు.

"ఇంత చాదస్తంవాళ్లు కూతురుచేత మెడికల్ ఎలాగ చదివించారు?" అని రంగారావుప్రశ్న.

"నాకు అదే ఆశ్చర్యం వేసింది, ముందు ఈ అమ్మాయికి వివాహంచేసినతర్వాత వితంతువు అయిందేమో అని అనుమానం కలిగింది లేదట ముందు ఎవరికో వివాహసంబంధం కుదిరిన తర్వాత ఇచ్చిపుచ్చుకోవడాల్లో తేడా వచ్చి సంబంధం పోయిందట. అప్పటినించీ పట్టుదలతో తండ్రి ఈ అమ్మాయిని మెడికల్ చదివించాడట. మొత్తంమీద భోజనాలు అవీ అయినతర్వాత నేను తిరిగి వచ్చేశాను. మళ్లీ మామూలు క్లాసులో ఆ అమ్మాయిని కలుసుకోవడం తప్ప విశేషంలేదు. మరొకరోజు! నేను చాలసేపు ఆసుపత్రిలో పని చేసి అలసిపోయి వెయిటింగురూములో ఒంటరిగా కూర్చున్నాను. అప్పటికే నా మనస్సులో పరిపరి ఆలోచనలు పోతూ ఉన్నాయి. ఆ ఆలోచనలపరంపర నా సిగరెట్టుపొగ మేఘాలతో కొత్తకొత్తరూపాలు పొందుతూఉంది. రాజ్యలక్ష్మి నా ప్రక్కన వచ్చి కూర్చుంది. నేను గుర్తుపట్టనే లేదు. సిగరెట్టు అయిపోయింది; రెండో సిగరెట్టు అంటిస్తున్నాను.

"డాక్టరు! అలాగ అమితంగా సిగరెట్టు కాలుస్తూఉంటే నీ ఆరోగ్యం చెడిపోదూ!" అని రాజ్యలక్ష్మి మందలిస్తూ మాటలాడింది.

"చెడిపోతే నీకేం?" అని నేను చిరాకుగా అన్నాను.

నాకేం అని కాదు. నిక్షేపంలాంటి మీ శరీరం ఎందుకు చెడగొట్టుకొంటారని మీ మనసులో ఏదో బాధిస్తూ ఉందా? నాతో చెప్తే నేం?" అని చనువుగా అడిగింది.

"లక్ష్మి! నా మనస్సులో బాధ! నా సిగరెట్లు అలవాటూ నీకు అనవసరం. నీపని నీవు చూచుకో" అని చెప్పి వెళ్ళిపోయాను. నాఆత్మీయవిషయాలలో యీవిడకు జోక్యం ఎందుకు అనిపించింది. అప్పుడు నిజానికి నేను చాలా మోటుగానే ప్రవర్తించాను. కాని ఆ అమ్మాయి అన్నీ మరచిపోయేఉంటుంది. నన్ను ఆదోరకంగా చూస్తూనే ఉండేది.

మరికొన్నాళ్ళతర్వాత ఊరిలోకి ఏదో ఇంగ్లీషు సినిమా వచ్చింది. అందరూ స్టూడెంట్సూ డాక్టర్లు వెళ్లారు. నేను వెళ్లలేదు. వాళ్లంతా మొదటిఆటకు పోవడం చూచి రాజ్యలక్ష్మి నావద్దకు వచ్చి డాక్టర్ మనం ఇద్దరం రెండోఆటకు వెళ్దాం! నాతో రాకూడదూ? అని అడిగింది.

"నీకు సినిమాకు వెళ్లాలని ఉంటే మిగతా స్టూడెంట్సుతో వెళ్ళకపోయావా? నాతో పెళ్లికానివాడితో పెళ్లికానిదానిని రాజ్యలక్ష్మి నీవు ఒంటరిగా రావడం ఎందుకు?" అన్నాను.

"మీతో వెళ్లాలనే నాకు ఉంది..."

"మీ నాన్నగారు ఏమీ అనరూ?"

"మీతో వెళ్లడానికి మా నాన్నగారు ఏమీ అనరు.

"మీతో సినిమాలకు బీచీకి వెళ్లవచ్చు అన్నారు" ఆమాట విని నాకు గొంతుక అడ్డు పడినట్టు అయింది. అప్పటికిమాత్రం "అదా! నాకు తలకాయినొప్పిగా ఉంది. నేను సినిమాకు రాలేను క్షమించు రాజ్యలక్ష్మి! అని చెప్పి" వచ్చేశాను. తరవాత రాజ్యలక్ష్మితో అంత చనువుగా మాటాడలేదు. నాకు బదిలీఅయ్యే సమయంలోకూడా ఒంటరిగా వచ్చి నాతో మాటలాడబోయింది. నేను అటువంటి అవకాశం ఇవ్వనేలేదు. ఆ పిల్ల అంటే అంత భయంగా ఉండేది." అని వెంకట్రావు తిరిగి సిగరెట్టుకేసీ శుభలేఖకేసీ చూచాడు.

"ఏం అంతకురూపిగా ఉంటుందా?"

"నిజానికి రాజ్యలక్ష్మి చాల రూపవతి. ఇప్పటి చదువున్నవాళ్లకు లేనిఅందచందాలు, వినయవిధేయతలు ఆమెలో ఉన్నవి." అని వెంకట్రావు మృదువుగా చెప్తున్నాడు. "మరి అయితే అలాంటిఅవకాశం ఎందుకు వదులుకొన్నావు" అని రంగారావు మళ్లీ అటకాయించాడు. కాదు. రాజ్యలక్ష్మి చేసుకుంది. కావాలని పక్షికోసం వచ్చే పరాసరంలాగ కనిపించింది. వాళ్ళనాన్న స్వయంగా ఈ పిల్లను ప్రోత్సహించి నాతో బీచికి వెళ్ళమని, సినిమాలకు వెళ్లమని ఉసికొల్పుతూఉన్నట్టు అనిపించింది. నే నేదో రాక్షసినోట్లోకి ఉరుకుతున్నట్టు భయం వేసింది. వాళ్లిద్దరూ నాకోసం ఉచ్చులు పన్ని ఎలాగో నన్ను అందులో ఈడుస్తున్నట్టు అయింది. ఎలాగో యీ వలనించి తప్పుకోవాలని అనుకున్నాను. తప్పుకొన్నాను. బయటపడ్డాను" అని వెంకట్రావు పూర్తిచేశాడు. "అయితే ముందు బీచీ షికార్లూ అవీ చేసి ఎందుకు ఆశపెట్టావు"అని నిలదీసి అడిగాడు రంగారావు.

"ఆడది మగవాడూ కలిసి తిరగగానే ఏదో ఒక సంబంధం ముడిపెట్టారు మన వాళ్లు. నాకలాంటి ఉద్దేశాలు లేవు" అని చెప్పడానికే నేను షికార్లు చేశాను.రంగా! మెడికల్ ప్రొఫెషన్‌లో ఉన్నవాళ్ళకి ఆడదానిమీద అందరికీ ఉన్నంతభ్రాంతి ఉండదు. ఆ సంగతి నీకు తెలిసేఉంటుంది. అందుకే రాజ్యలక్ష్మి అంటే ఒక కామ్యవస్తువుగా నే నెన్నడూ చూడలేదు. నాతో పరిచితమైన ఒక స్నేహితురాలుగా చూచుకొన్నాను. అది ఆమె అపార్థం చేసుకొంటే దానికి నే నేం చెయ్యను?" అని వెంకట్రావు చెప్పి లేవబోయాడు.

"అన్ని తప్పులూ ఒకపెళ్లితో సరి"అని రంగారావు అందించి "వెంకట్రావ్! ఇదేలాగుంది నీకు ఈవారం రావలసిన శుభవర్తమానం "శుభమో! అశుభమో కానీ ఈ శుభలేఖ రిజిస్టరిపోస్టులో ఎందుకు పంపించిందో ఇప్పటికి తెలియకుండా ఉంది" అని వెంకట్రావు అంటూ ఉండగా, రంగారావు రాగవరసతో 'నారికేళపాకము కదె కామినీహృదయకావ్యరసగ్రహణమ్ము" అని మంగళహారతి చదివాడు.

—

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహముచ్చులు, సెగ, సవాయివ్యాధులకు, గ్యారంటీ-చికిత్స, క్యాటలాగు ఉచితం

జి. వి. రెడ్డి అండ్ కో., "భాస్కరాశ్రమము",

గోపాలపురం, తూర్పు గోదావరిజిల్లా

గర్భ నిరోధిని

శరీరారోగ్యమునకు భంగంలేకుండ కొంత కాలమువరకు గర్భం రాకుండ ఆపుటకు ఔషధం రు. 10 లు. చాలాకాలంవరకు రాకుండ చేయుటకు రు 25 లు. వి. పి. చార్జీ రు 1-0-0

డాక్టర్ రత్నం సన్సు,

మలకపేట బిల్‌డింగ్స్, హైద్రాబాడ్, డక్కన్